# ప్రచారం హోరాహోరీ

- భారీ మెజార్టీ లక్ష్యంగా బీఆర్‌ఎస్ ఎత్తుగడలు
- బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాలు, ఆత్మీయ సమావేశాలతో ప్రచారానికి పదును

సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో రాజకీయం వేడెక్కింది..! పోరు బరిలో నిలిచే అభ్యర్థులెవరో తేలిపోవడంతో నామినేషన్లు వేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రజాక్షేత్రంలో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. పోల్ పోరులో తాడోపేడో తేల్చుకునేందుకు రెడీ అయ్యారు.. జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలతో బహిరంగ సభలు, రోడ్ షోలు, అంతర్గత సమావేశాలతో పాటు స్టార్ క్యాంపెయినర్లను ప్రచారంలోకి దించి ఓట్లను కొల్లగొట్టేందుకు అభ్యర్థులు పక్కా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఇప్పటికే రెండున్నర నెలలుగా గులాబీ పార్టీ అభ్యర్థులు ప్రజాక్షేత్రంలోనే ఉంటూ అన్ని వర్గాల ప్రజల మద్దతును కూడగట్టారు. అంతేకాదు బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఇప్పటికే చాలా నియోజకవర్గాల్లో ఆత్మీయ సమావేశాలు, బూత్ లెవల్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలు వంటి కార్యక్రమాలతో అభ్యర్థుల తరఫున ప్రచారం చేసి విపక్షాలకు దిమ్మతిరిగే షాకిచ్చారు. అభ్యర్థులు సైతం ఒకవైపు పాదయాత్రలు, మరోవైపు అన్ని వర్గాల మద్దతును కూడగట్టేందుకు ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు మీకు అన్ని విధాలుగా అండగా ఉన్న తమకు నవంబర్ 30వ తేదీన జరిగే ఎన్నికల్లో మద్దతుగా నిలిచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు.



సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రచారంలో ముస్లిం సోదరులతో కరచాలనం చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

ఇంటింటికీ ప్రచారం, పాదయాత్రలు ఒకవైపు.. మరోవైపు కలిసివచ్చే నేతలను బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తూ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తున్నారు. నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలతో క్యాడర్‌లో నూతనోత్తేజాన్ని నింపుతూ అందరినీ ఒక్క తాటిపైకి తీసుకువచ్చి అభ్యర్థుల గెలుపునకు బాటలు వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పదేండ్ల అభివృద్ధి, ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో ప్రచార అస్త్రంగా కాలనీలు, బస్తీలు తిరుగుతూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీలు 65 ఏండ్లు పాలించిన అభివృద్ధి జరగలేదని, గడిచిన పదేండ్లలోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం వందేండ్ల అభివృద్ధికి బాటలు వేసిందంటూ ప్రజల్లోకి తీసుకువెళ్తున్నారు.ఈ నేపథ్యంలోనే ఎన్నికల ప్రచారంలో అన్ని పార్టీల కంటే ముందున్న బీఆర్‌ఎస్ ప్రత్యర్థి పార్టీల డిపాజిట్లను గల్లంతు చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పావులు కదుపుతున్నారు. కలిసి వచ్చే ఇతర పార్టీల నేతలకు గులాబీ కండువాలు కప్పుతూ నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతూ ప్రతిపక్ష పార్టీలకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు.

## బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి



కాలనీ వాసులతో కలిసి సమావేశమైన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

వెంగళరావునగర్, నవంబర్ 4 : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ సాయిరామ్ గార్డెన్స్ అసోసియేషన్ వారితో ప్రభుత్వ పనితీరు, డివిజన్‌లో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తూ కాలనీవాసులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపీనాథ్ మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉన్నానని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించామని పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధికి ఎంతో సహకారం అందించామని తెలిపారు. అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగనంత అభివృద్ధి తెలంగాణలోనే జరిగిందన్నారు. పనిచేసే ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, అధ్యక్షుడు భవానీ, కార్యదర్శి బ్రహ్మారెడ్డి, ధర్మేందర్ దాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## వడ్డించిన విస్తరిలా బీఆర్‌ఎస్ పథకాలు

*ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్*



సమావేశంలో మాట్లాడుతున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్

బంజారాహిల్స్,నవంబర్ 4: సంక్షేమ పథకాల్లో వడ్డించిన విస్తరిలా ఉన్న బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. కుక్కలు చింపిన విస్తరిలా మారిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మడం లేదని ఎద్దేవా చేశారు. శనివారం బంజారాహిల్స్ రోడ్ నం. 11లోని లేక్ వ్యూ బంజారా ఫంక్షన్‌హాల్‌లో వెంకటేశ్వరకాలనీ డివిజన్ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కోలేటి దామోదర్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి ఎమ్మెల్యే దానం నాగేందర్ సమావేశానికి హాజరై మాట్లాడారు. తెలంగాణలో పేదలకు అవసరమైన అనేక సంక్షేమ పథకాలను తెచ్చింది తామేనని, రానున్న ఎన్నికల్లో మరోసారి వచ్చేది కూడా తామేనన్నారు. పదేండ్లలో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సుమారు 60 పథకాలు తెచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందు, ఆరు గ్యారెంటీలంటూ కాంగ్రెస్ చేస్తున్న హడావిడిని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాధించిన విజయాలను ఓటర్లకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తల పైనే ఉన్నదని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. ఇటీవల అన్ని సర్వేల్లో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని తేలిందన్నారు.ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ప్రసన్న రామ్మూర్తి, ఫైజల్ జాఫ్రీ, మాజీ కార్పొరేటర్ భారతీనాయక్, డివిజన్ అధ్యక్షుడు రాములు చౌహాన్, బాబానాయక్, రాంచందర్, సారంగపాణి, వెంకటస్వామి పాల్గొన్నారు.

*వరదలొచ్చినప్పుడు కనబడని లీడర్లు..*

## ఇప్పుడు ఓట్లడిగేందుకు వస్తున్నారు

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- వివిధ పార్టీల నుంచి 150 మంది చేరిక



రంగనాయకులగుట్ట కాలనీలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు, మహిళలు

హయత్‌నగర్, నవంబర్ 4: కాలనీల్లో వరద ముంపు సమయంలో కానరాని లీడర్లు.. ఇప్పుడు ఓట్లు అడిగేందుకు వస్తున్నారని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో రంగనాయకులగుట్ట బస్తీ, అంబేద్కర్ నగర్ కాలనీవాసులు దాదాపు 150 మంది యువకులు, మహిళలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... గతంలో చిన్నపాటి వర్షాలకు చుట్టుపక్కల కాలనీలైన అంబేద్కర్‌నగర్, బంజారాకాలనీలు ముంపునకు గురయ్యేవని.. ఎస్‌ఎన్‌డీపీ పనులు వేగంగా పూర్తి చేసి ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించామన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం కోట్ల నిధులు తీసుకొచ్చి దశలవారీగా కాలనీల్లో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో కొండయ్య, దేశ పద్మ, వీరమణి, శ్రీను, సాయి, మస్తాని, మల్లిక, రాజేశ్వరి, రాములు, రాము, రవి, సైదులు, నరేందర్ గౌడ్, రాకేశ్, రామకృష్ణ, మహేశ్, కరుణాకర్, నాగరాజు, ప్రవీణ్, రాజుతోపాటు పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు మల్లేశ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు భాస్కర్ సాగర్, కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్, పుష్ప, నాగరాజు, తిరుపతి, స్వామి నాయక్, వీరన్న, పాల్గొన్నారు.



*వినూత్నంగా ప్రచారం*

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సెక్రటేరియట్ కాలనీలో మహిళతో ముచ్చటిస్తూ ప్రచారం నిర్వహిస్తున్న ప్రముఖ సినీనటి లక్ష్మీశ్రీ, ప్రత్యూష ఫౌండేషన్ అధ్యక్షురాలు సరోజిని, బీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి తదితరులు

## పదేండ్లలోనే వందేండ్ల ప్రగతికి బాటలు



మల్కాజిగిరి డివిజన్‌లో ప్రచారం చేస్తున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 4: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లలోనే వందేండ్ల ప్రగతికి బాటలు వేసిందని అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం మల్కాజిగిరి డివిజన్‌లోని ఎస్‌పీనగర్ నుంచి పాదయాత్ర చేస్తూ ప్రచారం నిర్వహించారు. అల్వాల్, మచ్చ బొల్లారం, వెంకటాపురం, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లలో అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రచారం నిర్వహించి, పలు సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు.నియోజకవర్గ ప్రజలకు మౌలిక వసతులకు పెద్దపీట వేసిందన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను గెలిచిన తరువాత అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సునీతారాము యాదవ్, మీనాఉపేందర్ రెడ్డి, సబితాకిశోర్, శాంతిశ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్, పరశురాంరెడ్డి, జేఏసీ వెంకన్న, మురుగేశ్, హుడా మాజీ డైరెక్టర్ వీరేశం యాదవ్, అమీనుద్దీన్, ఖలీల్ పాల్గొన్నారు.

## అంబర్‌పేటలో కాంగ్రెస్‌కు షాక్

బీఆర్‌ఎస్‌లో చేరిన గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మహ్మద్



మహ్మద్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట/కాచిగూడ, నవంబర్ 4: అంబర్‌పేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీ గోల్నాక డివిజన్ సుందర్‌నగర్‌కు చెందిన గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు(మైనార్టీ నాయకుడు) మహ్మద్ బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి బీఆర్‌ఎస్‌లో చేరానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ మహ్మద్ కబీర్, సయ్యద్, సయ్యద్ సలీం తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు నియోజకవర్గంలోని మల్లికార్జున నగర్, గోల్నాక లాల్‌బాగ్, వీరన్నగుట్ట తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సీఎం కేసీఆర్ రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, వారి సహకారంతో అంబర్‌పేటలో తాను చేసిన అభివృద్ధి పనులను వారికి వివరించారు.